క్లుప్తంగా

జైపూర్‌లో డీపీవో పర్యటన



సూచనలు చేస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సక్రమంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలో గురువారం ఆయన పర్యటించారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను క్లుప్తంగా ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 1791దరఖాస్తులున్నాయని, త్వరగా వాటిని పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్ యూప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయనతో పాటు డివిజినల్ పంచాయతీ అధికారి ధర్మరాణి, ఎంపీవో బాపురావు, ఆర్‌ఐ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మోటర్ సైకిల్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

చెన్నూర్: పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వన్య ప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకొని ఫారెస్ట్ అధికారులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ ప్రభాకర్, ఎఫ్‌ఎస్‌వోలు అంజయ్య, రాజేశ్, విజయలక్ష్మి, భీమయ్య, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ మంజూరు చేయాలి

బెల్లంపల్లి: గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య చదువుకోవడానికి ఏకలవ్య మోడల్ స్కూల్‌ను బెల్లంపల్లి కేంద్రంగా మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పందుల పెంపకం కోసం ప్రతి మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ఐదెకరాల చొప్పున ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని, జీవనోపాధిని పెంపొందించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు, నాయకులు రవి, పోశం, రాము, అశోక్, సంపత్, శ్రీరాముల రమేష్, ముత్తయ్య, మల్లేష్, రాయమల్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువల శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవా సమితి ప్రశాంతి మందిరంలో ఆధ్యాత్మిక, మానవతా విలువల శిక్షణ శిబిరాన్ని గురువారం మందమర్రి జీఎం దేవేందర్ ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే మానవతా విలువలు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెద్దలను, గురువులను గౌరవించటం నేర్చుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్‌రావు, డాక్టర్ అశోక్‌వర్ధన్, సాయికాంతారావు, శ్రీనివాస్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సభ పోస్టర్‌ను గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ యాభై ఏళ్ల విప్లవ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు ఉన్నాయన్నారు. ఎందరో విద్యార్థి నాయకులు పోరాటాల్లో అసువులు బాసి అమరులయ్యారని గుర్తు చేశారు. విద్యారంగాన్ని కాపాడుకోవడానికి పీడీఎస్‌యూ ముందంజలో ఉందన్నారు. సభను ఈ నెల 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు మనోహర్, సాయి, రిషికుమార్, ప్రణయ్‌కుమార్, అజయ్, వంశీ, రాజు, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ



దండేపల్లి: గూడెంలో కొలువుదీరిన అమ్మవారు



వేమనపల్లిలో దుర్గామాత శోభాయాత్ర



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో పూజలు



తాండూర్: దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



సోమగూడెంలో స్వర్ణ కవచ అవతారంలో..

- దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సాక్షినెట్‌వర్క్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాత ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు డప్పుచప్పుళ్ల మధ్య మేళతాళాలతో మండపాలకు తీసుకొచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రాణప్రతిష్ట జరిపి ప్రత్యేక పూజలు, దుర్గాదేవి యాగాలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండపాళ వద్ద దుర్గామాత పాటలు మైకుల్లో హోరెత్తాయి. పలువురు అమ్మవారి దీక్షమాలను ధరించారు. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవార్లకు పూజలు చేయనున్నారు.



నస్పూర్: నాగార్జున కాలనీలో దుర్గామాత



జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన అమ్మవారి వద్ద ప్రత్యేక పూజల్లో భవానీదీక్షా పరులు



ఎల్‌ఐసీ కాలనీలో అమ్మవారికి పూజలు



శ్రీరాంపూర్: పూజలు నిర్వహిస్తున్న మేనేజర్



జన్నారంలో...



చెన్నూర్‌రూరల్: సుద్దాలలో



బెల్లంపల్లిరూరల్: చంద్రవెల్లిలో పూజలు



కోటపల్లి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కాసిపేట: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రామకృష్ణాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



చెన్నూర్ శివాలయంలో...



బెల్లంపల్లి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



గౌతమినగర్ కోదండ రామాలయంలో..

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గడ్డం వినోద్
- కలెక్టర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్

కాసిపేట/బెల్లంపల్లిరూరల్/బెల్లంపల్లి/భీమిని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లిలో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్ల సీ.ఆర్.ఆర్ నిధులతో బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామం రాష్ట్రీయ రహదారి నుంచి కన్నాల శివారులోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం వరకు నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వార్డులో బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని వార్డు కౌన్సిలర్ ప్రభాకర్ సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన చీరలను ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు పంపిణీ చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాసిపేట మండలం దేవాపూర్‌కు చెందిన ఠాకూర్ దుర్గప్రసాద్‌కు వీల్‌చైర్ అందించారు. కన్నెపల్లి మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో పి.హరికృష్ణ, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, డీఈపీఆర్ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పండుగ పూట కక్షసాధింపులే...

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



కూల్చివేసిన ప్రాంతాలను పరిశీలిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పండుగల వేళ వ్యాపారులను ఇబ్బందులకు గురిచేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమ కట్టడాల పేరిట కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వ్యాపార సముదాయాలను కూల్చివేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. మంచిర్యాల మార్కెట్‌లో మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలను గురువారం ఆయన సందర్శించారు. వ్యాపారులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే వాగులను కబ్జా చేసి ప్లాట్లు పెట్టి ఇళ్లను నిర్మించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పండుగల వేళ కూల్చివేతలను ఆపేయాలని, పండుగల అనంతరం వ్యాపారులను పిలిపించి, చర్చల ద్వారా కూల్చివేతలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీశ్‌జైన్, జిల్లా అధికార ప్రతినిధి పల్లి రాకేశ్, చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జి అక్కల రమేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, పట్టణ కార్యదర్శి రాకేశ్ రెన్వా, మెట్టుపల్లి జయరాం, బింగి ప్రవీణ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

నస్పూర్: పీఎం నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ సభ్యత్వ నమోదుకు జిల్లా వ్యాప్తంగా స్పందన లభిస్తుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని ఒకటో వార్డు సుందరయ్య కాలనీలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

వేమనపల్లి: మండల కేంద్రానికి చెందిన కొండ రవి, కంపెల అజయ్‌కుమార్ పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, మండల నాయకులు మడె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో, చెన్నూర్ మండలంలోని సంకారంలో గురువారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహించారు. సర్వే స్పెషల్ ఆఫీసర్ గణపతి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, నాయబ్ తహసీల్దార్ హరిత తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

క్రైం కార్నర్..

నిందితుల బైండోవర్

కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్న ఏడుగురి నిందితులను గురువారం రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశారు. అనంతరం సీఐ సుధాకర్ మాట్లాడుతూ.. పేకాట ఆడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని, బీఎన్‌ఎస్ సెక్షన్ 112(2) ప్రకారం 7సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్‌లో గురువారం అదే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు విద్యుత్ బల్బులు అమర్చుతుండగా విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాలయ్యాయి. బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం, మట్టి, ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్సలో జాప్యం.. యువకుడి మృతి

- ఈఎస్‌ఐ చెల్లించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- మెరుగైన వైద్యమందక ప్రాణాలు కోల్పోయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి



రాజశేఖర్ (ఫైల్)

నస్పూర్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతికి కారణమయ్యింది. వివరాల్లోకెళ్తే.. మున్సిపాలిటీలో ట్రాలీ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మాసు రాజశేఖర్(32) నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు అతడు ఆసుపత్రిలో చికిత్సకు అనర్హుడని తెలిపారని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. రాజశేఖర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు ఆర్థిక స్థోమత లేక ఈఎస్‌ఐ ఆసుపత్రిలో అర్హత లేక చికిత్స అందించడంలో జాప్యం జరిగింది. హైదరాబాద్‌కి తరలించి అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందినట్లు కార్మికులు తెలిపారు. ఈఎస్‌ఐ సదుపాయం ఉంటే సకాలంలో మెరుగైన వైద్యం అందేదని పలువురు చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీలో దాదాపు 130 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, అధికారులు ఈఎస్‌ఐ పేరుతో డబ్బులు కట్ చేస్తున్నారు. కొంత మొత్తాన్ని కలిపి కార్మికుల ఈఎస్‌ఐ అకౌంట్లలో జమ చేయాల్సి ఉండగా, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో జమ చేయగా, దాదాపు సంవత్సర కాలంగా మళ్లీ ఈఎస్‌ఐ అకౌంట్‌లో అధికారులు డబ్బులు జమ చేయలేదని కార్మికులు వాపోతున్నారు. దీంతో కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఏదైనా అనారోగ్యం పాలైతే, ఈఎస్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం ఇలాంటి సంఘటనలు పలుమార్లు జరిగాయని, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్మికుల ఈఎస్‌ఐ డబ్బులను అకౌంట్లలో జమ చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని పలువురు కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్‌ని సంప్రదించగా రాజశేఖర్ చికిత్స నిమిత్తం ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్తే వారు చికిత్సకు నిరాకరించారనేది నా దృష్టికి రాలేదు. మేము ఐదు నెలలుగా ఈఎస్‌ఐ డబ్బులు అకౌంట్లలో జమ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. టెక్నికల్ ఇష్యూతో డబ్బులు అకౌంట్లలో జమకావడం లేదని సిబ్బంది తెలిపారని అన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రం మీదుగా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న తూర్పాటి చంటిని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. మంచిర్యాల ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చంటి హాజీపూర్ మండలం మీదుగా 150కిలోల రేషన్ బియ్యంను ఆటోలో తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామానికి చెందిన గోపతి స్వామి ఇంట్లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లోని మంచాలు, పరుపులు, బట్టలు, ఇతర సామగ్రి, ధ్రువపత్రాలు దగ్ధం అయ్యాయి. నష్టాన్ని రెవెన్యూ అధికారులు అంచనా వేయనున్నారు.

సంక్షిప్త వార్తలు

'కల్తీ మద్యంపై ఫిర్యాదు చేసినా పట్టింపేది..?'

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలోని వైన్స్‌లో కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం ఆరిజిన్ డైరీ సీఏవో బొడపాటి శేజల్ ఆరోపించారు. ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారులు స్పందించి కల్తీ మద్యం వైన్స్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోండి'

బెల్లంపల్లి: విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీ అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి సబ్బని.రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి.వెంకటేష్ గురువారం డిమాండ్ చేశారు. సీడీపీవో వెంటనే విచారణ జరిపి బాధ్యురాలిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు శుద్ధమైన నీరు అందించాలి

వేమనపల్లి: ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటి పథకం ద్వారా శుద్ధమైన నీరు అందించాలని మిషన్ భగీరథ ఈఈ వెంకటేషం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు నీటి నాణ్యత, ప్రమాణాలపై వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ బద్రీనాథ్‌స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, సహాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

జన్నారం/దండేపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో, జన్నారం మండలంలోని పలు కూడళ్లలో బతుకమ్మ సంబురాలు రెండో రోజు గురువారం కొనసాగాయి.

'బాలలక్ష్మిని కలిసిన ఓయూ జేఏసీ నాయకులు'

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన ఓయూ జేఏసీ కో ఆర్డినేటర్ దుర్గం మల్లేష్ గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బాలలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

జైపూర్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని శ్రీరాంపూర్ సీఐ మోహన్ తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్, వ్యాపారస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ మోహన్, స్థానిక ఎస్సై శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు.